క్లుప్తంగా

అక్రమ మద్యం పట్టివేత

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న గోవిందమ్మను పక్కా సమాచారంతో ఎస్‌ఐ శ్రీకాంత్ బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. దొడ్డవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం అందడంతో ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. దొడ్డవరంలో అక్రమంగా మద్యం అమ్మతున్న వ్యక్తులను విచారణ చేస్తుండగా గ్రామానికి చెందిన ఒక మహిళ మద్యం అమ్ముతుందన్న సమాచారం అందింది. ఆమె ఇంట్లో సోదాలు చేయగా ఆమె వద్ద 42 క్వార్టర్ బాటిళ్లు లభించాయి. ఎస్‌ఐ శ్రీకాంత్ ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. శుక్రవారం ఆమెను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు: స్థానిక ప్రసన్న చెన్నకేశవస్వామి మాస కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. చిత్తానక్షత్రం సందర్భంగా రాత్రి 7 గంటల నుంచి కల్యాణోత్సవం జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనికుమారి, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వినియోగం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్సైకి గాయాలు

బల్లికురవ: వాకింగ్ చేస్తున్న బల్లికురవ పోలీస్ స్టేషన్ ఏఎస్సై సీ. బాలకృష్ణ గాయాలపాలయ్యారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం బల్లికురవ-కొమ్మాలపాడు ఆర్‌అండ్‌బీ రోడ్‌లో జరిగింది. అందిన సమాచారం ప్రకారం ఏఎస్సై విధులు ముగించుకుని బల్లికురవ నుంచి కొమ్మాలపాడు రోడ్డులో చెన్నుపల్లి వరకు వాకింగ్‌కు వెళ్తున్నారు. వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టటంతో కాళ్లు, చేతులు, తలకు గాయాలయ్యాయి. స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా ప్రదేశానికి హుటాహుటిన వచ్చిన సిబ్బంది. చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు.

ఎదురెదురుగా రెండు బైకులు ఢీ

అద్దంకి రూరల్: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన బుధవారం అద్దంకి పట్టణంలో రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. రేణింగవరం గ్రామానికి చెందిన రాయిని సిద్దయ్య, అద్దంకిలోని శ్రీనగర్‌కు చెందిన శ్రీనివాసరావులు బైకు మీద వస్తున్నారు. మరో గుర్తు తెలియని వ్యక్తి బైకు మీద అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై నున్న ద్వారకా నగర్ వద్ద మలుపు వద్దకు రాగానే రెండు బైకులు ఢీకొన్నాయి. సిద్దయ్య, శ్రీనివాసరావులకు తీవ్ర గాయాలయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి శింగరకొండ వైపు వెళ్లాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

ఆస్తి విషయంలో కుమారుడిపై దాడి

అద్దంకి రూరల్: ఆస్తి విషయంలో తల్లి, చెల్లి, చిన్నమ్మ కలిసి కుమారుడిపై దాడిచేసిన ఘటన బుధవారం స్థానిక బత్తుల వారిపాలెంలో జరగగా క్షతగాత్రుడు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా వైద్యాశాల నుంచి వచ్చిన సమాచారంతో ఎస్సై ఆదిలక్ష్మీ గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని గుంజివారిపాలెంలో నివాసం ఉంటున్న వెంకటరావు బైక్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు ఈ నేపథ్యంలో తండ్రి వెంకటేశ్వర్లుతో ఆస్తి విషయంలో తల్లి, చిన్నమ్మ, చెల్లి గొడవ పడుతున్నారు. ఆదే సమయంలో వెంకటరావు ఇంటికి రావడంతో ఎంటి విషయం అని అడగటంతో వెంకటరావుపై దాడికి పాల్పడ్డారు. దీంతో వెంకటరావుకు గాయాలవటంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం

వేటపాలెం: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి సహచర ఫొటోగ్రాఫర్‌లు అండగా నిలిచారు. ఈనెల 20న ఊటుకూరి సుబ్బయ్యపాలేనికి చెందిన ఫొటోగ్రాఫర్ పీ. అంజయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం అంజయ్య ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలు వేసి నివాళులరించి కుటుంబానికి సంతాపం తెలిపారు. మృతుడి కుమారుడు నాగబాబుకు రూ. 21 వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. అంజయ్య కుటుంబానికి అసోసియేషన్ తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చీరాల క్షీరపురి ఛాయాచిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ మల్లికార్జున, సెక్రటరీ ఆఫీద్, కోశాధికారి మస్తాన్ వలీ, అందె ప్రసాద్, కిషోర్, నేతాజీ, పోతు రాజు, రంగనాథ్, అరవింద్, శేషు, చింతం కోటివీరయ్య, రాజు, సుబ్బారావు, పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



గజమాలతో ఎమ్మెల్యే టీజేఆర్‌ను సన్మానిస్తున్న నాయకులు

- ప్రతి ఇంట్లో జగనన్న సంక్షేమ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు 40వ కార్పొరేట్ డివిజన్‌లో వడ్డెరపాలెం, ఇందిరానగర్, చైతన్యకాలనీలో బుధవారం ఎమ్మెల్యే టీజేఆర్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికుల నుంచి విశేష స్పందన లభించగా, ఆయా కాలనీలలో ఇంటింటికి తిరిగి సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు బుక్‌లెట్లను ప్రజలకు ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దోహదపడ్డాయని తెలిపారు. పేదల కడుపు చల్లగా ఉండాలంటే సంక్షేమ పథకాలను నిరంతరం అందించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా నాలుగు సంవత్సరాలకుపైగా సంక్షేమ పథకాలను సీఎం అందిస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పి ఎన్నికలు వచ్చే ముందు అరకొరగా ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది నుంచి ఇచ్చిన దాఖలాలు లేవంటూ గత పాలకుల వైఖరిని ఎండగట్టారు. కానీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన రోజు నుంచే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని రానున్న ఎన్నికల్లో కూడా ఆశీర్వదించి అండగా నిలవాలని, మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని లబ్ధిదారులకు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సూచించారు. తొలుత స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాలతో పూల వర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. గజమాలలతో శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, బాలాంజనేయరెడ్డి, దుంపా యలమందారెడ్డి, క్రిష్టిపాటి శేఖరరెడ్డి, జీ ఓబుల్ రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌పై వెళ్లిన హెచ్‌ఎంకు సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న గుండ్లాపల్లి పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మద్దిపాడు: ప్రమోషన్‌పై మద్దిపాడు ఎంఈవో-2గా బదిలీ అయిన మెడబలిమి శ్రీనివాసరావును గుండ్లాపల్లి పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. శ్రీనివాసరావు గుండ్లాపల్లి పాఠశాలలో 6 సంవత్సరాలకుపైగా హెచ్‌ఎంగా పనిచేసి అక్కడి నుంచి బదిలీపై కరవది ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడి నుంచి పదోన్నతి పొంది ఎంఈఓ-2గా మద్దిపాడు బదిలీ అయ్యారు ఈ క్రమంలో గుండ్లాపల్లి పాఠశాల ఉపాధ్యాయులంతా హెచ్‌ఎం ప్రభాకర్‌రావుతో కలిసి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎంగా ఉన్న సమయంలో పాఠశాల ఉన్నతికి కృషి చేశారని కొనియాడారు.

ఆర్‌బీఐ ఆదేశాలతో చిన్నారులకు క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీసీఈబీ కార్యదర్శి వెంకారెడ్డి

ఒంగోలు: రిజర్వు బ్యాంకు ఆదేశాల ప్రకారం జిల్లాస్థాయిలో విద్యార్థులకు స్థానిక సెయింట్ జేవియర్స్ హైస్కూల్లో బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా డీసీఈబీ కార్యదర్శి డి.వెంకారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 34 మండలాల నుంచి 34 పాఠశాలల టీంలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. తాళ్లూరు మండలం లక్కవరం జెడ్పీహెచ్‌ఎస్, వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువు జెడ్పీహెచ్‌ఎస్, ఒంగోలు మండలం ఉలిచి జెడ్పీహెచ్‌ఎస్ టీంలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమాన్ని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ యు.అబ్దుల్ రహీం, లీడ్ బ్యాంక్ ఆఫీసర్ బి.అనీల్‌కుమార్, ఇండియన్ బ్యాంకు మేనేజర్ డి.రామారావు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

మాదిగల సభను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ

నాగులుప్పలపాడు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 29వ ఆవిర్భావం సందర్భంగా నిర్వహించనున్న మాదిగల జనజాగృతి సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ పిలుపునిచ్చారు. జన జాగృతి సభ సమీకరణలో భాగంగా మండలంలోని ఉప్పుగుండూరు, కండ్లగుంట, ఒమ్మెవరం, మట్టిగంట, ఈదుమూడి, తిమ్మసముద్రం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు గరటయ్య, మల్లెల ప్రసాద్, అశోక్, అత్తంటి డేవిడ్, పాలపర్తి రత్నాకర్, అత్తంటి బెన్నియ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ, హెల్త్ క్లినిక్ సెంటర్ ఆకస్మిక తనిఖీ



పాదర్తిలో పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి

కొత్తపట్నం: స్థానిక పీహెచ్‌సీని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజ్యలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీలు ఎన్ని వస్తున్నాయి, ప్రసవాలు జరుగుతున్నాయా, మందుల కొరత ఉందా.? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రంగాయపాలెం వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను సందర్శించి ఎంఎల్‌హెచ్‌పీ జాన్సీ పనితీరును అడిగి తెలుసుకున్నారు. పాదర్తి గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంను పరిశీలించారు. ఓపీలు ఎన్ని వచ్చాయి, ఎంత మంది గర్భిణులు చికిత్స పొందుతున్నారనే వివరాలను డాక్టర్ వైష్ణవిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఓపీ శాతాన్ని పెంచాలని సిబ్బందికి సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యంపై ఎంతో ఖర్చు చేస్తోందని, మీ ఇంటి వద్దకే వైద్యం అందిస్తోందని, అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ ప్రసాద్

నాగులుప్పలపాడు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు, నవరత్నాలలో ఇంకా మిగిలిపోయిన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల అందజేత వంటి పనులను అధికారులు వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జగనన్న సురక్ష పథకం ద్వారా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల ఎంపిక, గృహ నిర్మాణాలను వేగవంతంగా చేయాలని కోరారు. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్క సిబ్బంది లక్ష్యం ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. ఎంపీడీవో కన్వీనర్‌గా ఉండే మండల కమిటీ ఏర్పాటు చేసుకుని క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల అర్హతను నిర్ధారించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, హౌసింగ్ ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు పొగాకు ఉత్పత్తిపై పెనాల్టీ రద్దు చేయాలి

ఒంగోలు: అదనపు పొగాకు ఉత్పత్తిపై పెనాల్టీ రద్దు చేయాలని ఢిల్లీలో వాణిజ్య శాఖామంత్రి పియూష్ గోయల్‌ను కలిసి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏపీలో పొగాకు రైతులు అదనంగా పండించిన పంటపై గతంలో ఐదు శాతం పెనాల్టీ విధిస్తున్నారని, ప్రస్తుత సంవత్సరం కర్ణాటకలో సదరు పెనాల్టీని పూర్తిగా ఎత్తివేయడం జరిగిందని అన్నారు. ఏపీలో కూడా ఈ పెనాల్టీని ఎత్తివేయాలని కోరారు. దానికి కేంద్రమంత్రి స్పందించి కర్ణాటక రాష్ట్రంలో మాదిరే ఏపీలో కూడా ఈ ఏడాదికి పెనాల్టీని పూర్తిగా తీసివేస్తామని చెప్పారు. వాణిజ్య శాఖ అదనపు సెక్రటరీ అయిన రాకేష్ అగర్వాల్‌కు ఈ విషయమై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించడం సంతోషంగా ఉందని ఎంపీ మాగుంట పేర్కొన్నారు. ఎంపీ వెంట పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, చిడిపోతు యశ్వంత్, పొగాకు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం

ముండ్లమూరు (తాళ్లూరు): మండలంలోని పలు గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సెంట్రల్ నోడల్ అధికారి జలశక్తి అభయాన్ డైరెక్టర్ ట్రైబల్ ఎఫైర్స్ న్యూఢిల్లీ మనోజ్‌బాపన, టెక్నికల్ అధికారి పి. యాదయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ కె. శీనారెడ్డి చేపట్టిన పనులను పరిశీలించారు. నాగంబొట్లపాలెం, తాళ్లూరు గ్రామాల్లో పండ్ల తోటల పెంపకం, పంట కాలువలో పూడికతీత పనులును వారు బుధవారం పరిశీలించారు. పండ్ల తోటల వలన కలిగే ప్రయోజనాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. తాళ్లూరు, నాగంబొట్లపాలెం సర్పంచ్‌లు ఎం. చార్లెస్ సర్జన్, చిమట సుబ్బారావు, సొసైటీ ప్రెసిడెంట్ శనివారపు శ్రీనివాసరెడ్డి, తాళ్లూరు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, ఏపీఓ మురళి, ఈసీ ప్రసాద్, తదితర అధికారులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. ఇరువురికి గాయాలు

దర్శి: మండలంలోని బొట్లపాలెం వద్ద రెండు బైకులు ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. బొట్లపాలెం గ్రామానికి చెందిన పి. వీరారెడ్డి పొలం నుంచి గడ్డిమోపుతో రోడ్డుపైకి వస్తున్నాడు. అదే సమయంలో దర్శి నుంచి తాళ్లూరు మండలం తోట వెంగన్నపాలెం గ్రామానికి చెందిన గోశెట్టి వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై తన స్వగ్రామం వెళుతుండగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఇద్దరినీ ఒంగోలు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు.

గో సంరక్షణ చట్టం అమలు చేయండి

గిద్దలూరు రూరల్: గో సంరక్షణ చట్టం అమలు చేయాలని స్థానిక విశ్వహిందూ పరిషత్ నిర్వాహకులు బుధవారం తహసీల్దార్ డి.సీతారామయ్యకు, ఎస్సై బ్రహ్మనాయుడును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో జరుగుతున్న గో వధను అధికారులు అడ్డుకోవాలని వారు కోరారు. యర్రారెడ్డి, బూజుమేకల రాజు, మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఆర్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలి

పుల్లలచెరువు: విత్తనాలను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు రమాదేవి పేర్కొన్నారు. బుధవారం వ్యవసాయాధికారి పుల్లలచెరువు, ముటుకుల గ్రామాల్లోని విత్తన దుకాణాలను ఏఓ నిర్మలాదేవి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఏడీ రమాదేవి మాట్లాడుతూ ఎంఆర్పీ ధరలకే విత్తనాలను విక్రయించాలన్నారు. విత్తన నిల్వలను, ధరలను చూపించే బోర్డులను తప్పని సరిగా దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేని సుమారు లక్ష రూపాయల విలువ కలిగిన విత్తనాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లుగా ఉంటే రైతులు తమకు సమాచారం అందజేయాలన్నారు. ఏవో నిర్మిలాదేవి, వీఏఏలు ఆర్. కొండానాయక్, కె. కొండానాయక్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళా కళాకారులు

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామంలో శ్రీలక్ష్మి పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి 16వ వార్షికోత్సం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బత్తుల వెంకట్రావు, నాగమల్లేశ్వరి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలచే కోలాట కార్యక్రమం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటాన్ని తిలకించారు.

పాలంకకు తరలిన భక్తులు

యర్రగొండపాలెం: పాలంక వీరభద్రస్వామి తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బుధవారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. తొలిఏకాదశి సందర్భంగా గురువారం భక్తులు స్వామికి ప్రత్యేకంగా పూజలుచేసి నైవేద్యం అందిస్తారు. స్వామిని దర్శించుకోవటానికి వెళ్లే భక్తులకు ప్రత్యేకంగా మండలంలోని గంజికుంటవారిపాలెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మలేరియా జ్వరం రాకుండా వైద్యులు ముందు జాగ్రత్త చర్యల కింద భక్తులకు మందులు అందజేస్తున్నారు. పాలంకలో కూడా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు.

ప్రతి ఇంటికి వెళ్లి మాట్లాడాలి



ఒంగోలు గోపాల్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ చల్లా తిరుమలరావు



మోటుమాలలో ఇంటింటి సర్వే చేస్తున్న సర్పంచ్ గోపి, వెంకటేశ్వర్లరెడ్డి

- అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు రాలేదేమో తెలుసుకోవాలి
- సచివాలయ సిబ్బందితో కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష పథకం గురించి వివరించడానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కనీసం 15 నిమిషాల పాటైనా వాళ్లతో మాట్లాడాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం నగరంలోని గోపాల్‌నగర్, నీలాయపాలెం ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నగరపాలక సంస్థ 6వ డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమలరావుతో పాటు వలంటీర్లు, వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి డివిజన్‌లోని ప్రతి ఇంటికి తిరిగారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23వ తేదీ ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం గురించి స్థానికులకు కమిషనర్ వివరించారు. గోపాల్‌నగర్-3, నీలాయపాలెం సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏం వస్తున్నాయి, అర్హత ఉండి రాని పథకాలు ఏమైనా ఉన్నాయా అని ఆరాతీయాలని సిబ్బందికి సూచించారు. సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల సర్టిఫికెట్లు కూడా ఏమైనా రావాల్సి ఉంటే వాటి గురించి కూడా మాట్లాడాలన్నారు. అన్ని విషయాలు పూర్తిగా మాట్లాడాలంటే కనీసం 15 నిమిషాలైనా పడుతుందన్నారు. లబ్ధిదారులను గుర్తించి వారిని ఈ రెండు సచివాలయాల పరిధిలో జూలై 5వ తేదీ నిర్వహిస్తున్న క్యాంపులకు తీసుకురావాలని సూచించారు. ఇంటింటి సర్వేను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, సిబ్బంది, గృహ సారథులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు...

ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నుల వసూళ్ల కోసం గురువారం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకుని కార్యాలయానికి సెలవు అయినప్పటికీ ప్రజల ప్రయోజనార్థం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30వ తేదీతో ముగుస్తున్నందున సెలవు రోజు కూడా పన్నుల వసూళ్లకు ఏర్పాట్లు చేశామన్నారు. పన్నుల పాత బకాయిదారులు కూడా చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోటుమాలలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం...

మోటుమాల (కొత్తపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేశ్వర్లరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్ ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేశారు. వారి సమస్యలు నమోదు చేసుకుని లబ్ధిదారులకు టోకెన్లు జారీ చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అందుకే ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, అధికారుల సమేతంగా ప్రతి ఇంటికి తిరిగి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం జరుగుతోందన్నారు. ఇటువంటి అవకాశం ఎప్పుడూ రాలేదని, గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రుసుం తీసుకోకుండా అందజేస్తున్నట్లు తెలిపారు. నమోదు చేసుకున్న వారం రోజులకే సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా బ్రోచర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఒంగోలు: మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా స్థానిక శ్రీసరస్వతి డిగ్రీ కాలేజీలో బుధవారం సెబ్ అధికారులు సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులు బ్రోచర్లు ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సెబ్ అదనపు ఎస్పీ ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండగలిగితేనే యువత విజయం సాధించగలరన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక బలాన్ని కోల్పోతారన్నారు. యువత నేడు ఎక్కువగా మత్తుపదార్థాలు వినియోగిస్తోందని, వారిలో చైతన్యం తీసుకొచ్చి అటువంటి వాటికి దూరంగా ఉంచేందుకు తాము కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. దిశ పీఎస్ సీఐ మల్లికార్జున మాట్లాడుతూ యువతకు దిశ యాప్ గురించి అవగాహన కల్పిస్తే ఆపదలో ఉన్న మహిళలకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అందువల్ల దిశ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దిశ పీఎస్ ఎస్సై ఫాతిమా, కాలేజీ చైర్మన్ ఏవీ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు రుణాలు



చెక్కులు అందజేస్తున్న ఎస్‌బీఐ జీఎం, డీజీఎం

- ఎస్‌బీఐ జీఎం నారాయణ శర్మ
- రూ.22 కోట్ల చెక్కులు అందజేత

మార్కాపురం: మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు రుణాలు ఉపయోగపడతాయని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ నారాయణశర్మ, డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్‌బీఐ బజారు బ్రాంచ్ ఆవరణలో ఎస్‌హెచ్ గ్రూప్‌లకు 22 కోట్ల రూపాయల రుణాలకు సంబంధించిన చెక్కులు అందించారు. వారు మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధికి ఎస్‌బీఐ సహకారం అందిస్తోందని, తీసుకున్న రుణాలతో తాము అనుకున్న వ్యాపారాలను ప్రారంభించి అభివృద్ధి చెందుతూ రుణాలు సక్రమంగా చెల్లించాలని కోరారు. మొత్తం 17 గ్రూపులకు రుణాలు అందించినట్లు మేనేజర్ ప్రసన్నకుమార్ తెలిపారు. డ్వాక్రా గ్రూప్ మహిళలు వివిధ రకాల యూనిట్లు స్థాపించుకోవాలని కోరారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రమేష్, తర్లుపాడు మేనేజర్ దేవరకొండ బాబు, ఫీల్డ్ ఆఫీసర్లు రాజేష్, లక్ష్మణరావు, తర్లుపాడు ఏపీఎం పిచ్చయ్య, సీసీలు ఎలీషా, మానోకుమారి, సాయిలు, నాగబూషణం పాల్గొన్నారు. మహిళలు తయారు చేసిన వెదురుబుట్టలను పరిశీలించి వారిని అభినందించారు.